నిధుల కొరత.. అసంపూర్తి పనులు

- అరకొర వసతులతో ఇబ్బందులు
- అద్దె భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం

పెద్దవంగర : తహసీల్దార్ కార్యాలయం పాలనలో ముఖ్యమైన పాత్ర పోషిస్తూ ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధిగా పని చేస్తుంది. కాగా పరిపాలన సౌలభ్యం కోసం మండలాల పునర్విభజనలో భాగంగా పెద్దవంగరను 2016 దసరా రోజున పది గ్రామ పంచాయతీలతో కలిపి మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు.

పనులు పూర్తయ్యేదెప్పుడో..

అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఓ అద్దె భవనంలో రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నూతన భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు కేటాయించగా 2022లో పనులు ప్రారంభించారు. కాగా ప్రస్తుతం పనులు స్లాబ్‌పోసి గోడల వరకు నిర్మించి కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే వదిలేశారు. నిధుల కొరతతో రెండేళ్ల నుంచి పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది.

దాతల సాకారంతో..

ప్రజలకు పాలన చేరువ చేసి ప్రభుత్వ పథకాలను



అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం

సమర్థవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో నాటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండలాల పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది. ఏళ్లు గడుస్తున్న ప్రభుత్వ స్థలం లేకపోవడంతో కార్యాలయాల నిర్మాణం చేపట్టలేకపోయారు. దీంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన భూ దాతలు జాటోత్ నెహ్రూ నాయక్, కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, పాలకుర్తి యాదగిరి రావు, అనబత్తుల ప్రభాకర్‌రావు, నాగేశ్వర్ రావు, చెరుకు మహేశ్వర్ రెడ్డి, ముప్పాల సురేష్‌బాబు, పసులేటి వెంకటరామయ్య తహసీల్దార్ కార్యాలయం భవన నిర్మాణానికి తమకు చెందిన ఎకరం 20 గుంటల భూమిని దానం చేశారు.



అద్దెభవనంలో తహసీల్దార్ కార్యాలయం

ఇరుకు గదుల్లో అవస్థలు..

అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం ఇరుకుగా ఉండడంతో ఫైళ్లను కూడా నేల మీదే పెటాల్సి వస్తోంది. పనులకు వచ్చేవారు కూర్చోవడానికి కూడా ఇబ్బందిగా ఉంటోంది. అలాగే పార్కింగ్ లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. సొంత భవనం లేక ఇరుకు గదుల్లో కార్యాలయం కొనసాగుతోంది. నూతన భవన నిర్మాణంతో ఇబ్బందులు తీరుతాయని అధికారులు, ఉద్యోగులు భావించారు. కానీ రెండేళ్ల నుంచి పనులు పూర్తి కావడం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయాల ఏర్పాటుకు కృషి



పెద్దవంగర మండలంలో నూతన కార్యాలయాల ఏర్పాటు కృషి చేస్తా. అద్దె భవనాల్లో కొనసాగుతున్న విషయాన్ని గుర్తించాను. ప్రభుత్వం పక్కా భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. త్వరలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించే అవకాశం ఉంది. గత ప్రభుత్వ నిర్వాకంతో తహసీల్దార్ కార్యాలయం పనులు నిలిచి పోయాయి. ఆగిన పనులను పునరుద్ధరించి పూర్తి అయ్యేలా ప్రత్యేక చొరవ చూపుతాను.

\- యశస్వినిరెడ్డి, ఎమ్మెల్యే, పాలకుర్తి

అభినందనీయం



ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ఎమ్మెల్యే చొరవ చూపడం అభినందనీయం. 2016 నుంచి ప్రభుత్వ కార్యాలయాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. గత ప్రభుత్వం ఈ సమస్యలను పట్టించు కోలేదు. ఎమ్మెల్యే స్పందించి కార్యాలయం పనులకు కృషి చేయడం హర్షనీయం.

\- బానోత్ సీతారాం నాయక్, పోచారం

క్లుప్తంగా

ఆర్థికసాయం



కేసముద్రం : మండలంలోని ఉప్పరపల్లి చెందిన ఫొటోగ్రాఫర్ బండారు శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మండల ఫొటో, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.25,500లను గురువారం అందజేశారు. అదే విధంగా వరంగల్ చందన కలర్ ల్యాబ్ సూరిబాబు 25 కేజీల బియ్యం అందజేశారు.

స్వయంపాలన దినోత్సవం



కురవి : మండలంలోని తట్టుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. హెచ్‌ఎంగా కె.సంజన, డీఈఓగా ఎస్‌కే ఇమ్రాన్, ఎంఈఓగా ఎస్‌కే ఇలియాజ్, పీఈటీగా ఎస్‌కే రాఖీబ్, డి.నాగరాజులు వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.నిరంజన్, ఉపాధ్యాయులు షౌకత్ అలీ, కె.సత్యనారాయణ, దివ్యజ్యోతి, నరేందర్, మాధవ్, ఉదయ్ కృష్ణ పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

బయ్యారం : బయ్యారం మండల కేంద్రం నుంచి చోక్లాతండా వరకు కంకర పరిచి వదిలేసిన రోడ్డు పై గురువారం డస్ట్ పోయడంతో పాటు వాటర్ క్యూరింగ్ పనులు చేపట్టారు. 'కంకర పరిచి.. తారు మరిచి' అనే కథనంతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. ఈ వార్త కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. త్వరలో తారు పోయిస్తామని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మహిళలకు వంట సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే

తొర్రూరు రూరల్ /పెద్దవంగర: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలో అమ్మాపురం ప్రభుత్వ పాఠశాలకు, పెద్దవంగర మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు మంజూరైనా మధ్యాహ్న భోజనం వంట గిన్నెలను మహిళలకు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కారు వద్దకు వెళ్తున్న ఎమ్మెల్యేను విద్యార్థులు, తల్లిదండ్రులు అడ్డు తగిలి భోజనం సరిగ్గా పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తమ నిరసనను తెలిపారు. తొర్రూరు మండలంలోని అరిపిరాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సుంచు రాములు కుటుంబాన్ని పరామర్శించారు.

ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్‌రెడ్డి



గూడూరు: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

మహబూబాబాద్ అర్బన్ /పెద్దవంగర/మరిపెడ/చిన్నగూడూరు/నర్సింహులపేట/గూడూరు/డోర్నకల్: ఎలాంటి ఆందోళన చెందకుండా విద్యార్థులంతా నిర్భయంగా పరీక్షలు రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల, ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవికుమార్ మండల కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏఎంఓ చంద్రశేఖర్, చీఫ్ సూపరిండెంటెంట్ శ్రీనివాస్, సుజాత, వీరస్వామి పాల్గొన్నారు. అలాగే అయోధ్యపురం పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులకు పదో తరగతి హాల్ టికెట్లను జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ పంపిణీ చేశారు. డోర్నకల్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో 220 మంది, నిర్మలా హైస్కూల్‌లో 219 మంది, బ్రిలియంట్ పాఠశాలలో 202 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే ఆయా మండల కేంద్రాల్లోను పదో తరగతి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నిందితులకు జైలు, జరిమానా

డోర్నకల్ : పెళ్లి వేడుకలో ఘర్షణకు పాల్పడి, దాడి చేసిన కేసులో ఏడుగురికి మహబూబాబాద్ కోర్టు వారం రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. సిగ్నల్‌తండాకు చెందిన శిరీషతో ఖమ్మం జిల్లా కమలాపురం శివారు బోటితండాకు చెందిన భూక్యా బావ్‌సింగ్‌కు 2019 ఏప్రిల్ 18న వివాహం కాగా మరుసటి రోజు విందు వేడుక జరిగింది. వేడుక ముగించుకుని బోటితండాకు వెళ్తుండగా ధరావత్ రమేష్ అనే వ్యక్తి వద్ద టెంటు సామాన్లు తీసుకోలేదంటూ నూనావత్ రాజేష్, బోడ విజయ్‌కుమార్, భూక్యా అనిల్, ధరావత్ రమేష్, ధరావత్ నతన్, బానోత్ నాగేశ్వర్‌రావు, జర్పుల నివాస్ కలిసి పెళ్లి బృందంపై దాడి చేయగా భూక్యా సుశీల, అజ్మీర రోజాకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ బి.రాజేష్ సహకారంతో కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. గురువారం అడిషనల్ జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ టి.తిరుపతి ఏడుగురు నిందితులకు వారం రోజుల జైలు శిక్ష లేదా రూ.500 జరిమానా విధించారు. వీరిలో బోడ విజయ్‌కుమార్, ధరావత్ రమేష్, భూక్యా అనిల్, బానోత్ నాగేశ్వర్‌రావు, జర్పుల శ్రీనివాస్‌కు మరో సెక్షన్ ప్రకారం అదనంగా వారం రోజుల జైలు శిక్ష లేదా వెయ్యి రూపాయల జరిమానా విధించారు.

పోరాట యోధుడు ఠాణు నాయక్



నెహ్రూసెంటర్: ఠాణు నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠాణు నాయక్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ వెంకన్న నాయక్ పేర్కొన్నారు. ఠాణు నాయక్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గురువారం నివాళులర్పించారు. ఠాణు నాయక్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్ మోతీలాల్, గుగులోత్ నందులాల్, మాలోత్ సురేష్, బానోత్ రెడ్యా, బోడ సుమన్, నరేష్, రమేష్, రాంబాబు, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గార్ల : మండలంలోని సేరిపురం, మర్రిగూడెం తండాల్లో ఠాణు నాయక్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరినాయక్, బి.పూల్‌సింగ్, శంకర్ నాయక్, బి.బుజ్జి, లక్ష్మి, ద్వాలి పాల్గొన్నారు.

ఠాణు నాయక్ స్ఫూర్తితో ఉద్యమించాలి

కురవి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు ఠాణు నాయక్ స్ఫూర్తితో ఉద్యమించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని గుడి సెంటర్ వద్ద ఠాణు నాయక్ వర్ధంతి నిర్వహించారు. బానోత్ దేవానాయక్, బదావత్ లింగా నాయక్, తేజావత్ దేశ్లా నాయక్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

తొర్రూరు: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఠాణు నాయక్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాటోతు బాలునాయక్ తెలిపారు. గొప్ప పోరాట చరిత్ర కలిగిన ఆయన విగ్రహాన్ని ట్యాంకుబండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షులు ఈదునూరి శ్రీకాంత్, గిరిజన నాయకులు మాలోతు సురేష్‌బాబు, కునుసోతు ప్రవీణ్, ధరావత్ సంతోష్, బాలాజీ, చరణ్, అఖిల్‌లు పాల్గొన్నారు.

అన్యమత ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్తులు



మత పుస్తకాలను దహనం చేస్తున్న గ్రామస్తులు

దంతాలపల్లి : అన్యమతస్తులు మా వద్దకు రావొద్దని, మత ప్రచారాన్ని తమ గ్రామంలో నిర్వహించొద్దని గ్రామస్తులు మత ప్రచారస్తులను అడ్డుకున్న సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామానికి యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన కొంతమంది క్రైస్తవ మతస్తులు ప్రచారం చేసేందుకు గురువారం చేరుకున్నారు. ఈ క్రమంలోనే గ్రామంలో కొంత మంది తమ గ్రామంలో క్రైస్తవ మత బోధనలు ఎందుకు చేస్తున్నారని అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య మాట, మాట పెరిగి మతస్తుల వద్ద నుంచి పుస్తకాలు లాక్కొని మంటల్లో వేసి దహనం చేశారు.

'ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి'

మహబూబాబాద్ : ఇల్లు నిర్మించుకునే వారికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకుల రాజు, కుంట ఉపేందర్, యూనియన్ గౌరవ అధ్యక్షుడు బానోత్ శంకర్, కార్యదర్శి శ్రీశైలం డిమాండ్ చేశారు. ఇసుక సమస్యను పరిష్కరించాలని కోరుగూ సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉప్పలయ్యా, కోటేశ్వర్‌రావు, వెంకన్న, శ్రీనివాస్, రాము, బిచ్యా, యాదగిరి, మౌలానా, దస్తగిరి, రహీం, కొండయ్యా, సుధాకర్, నాగన్న, మల్లయ్య పాల్గొన్నారు.

నియామకాల్లో స్థానికులను గుర్తించాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మహబూబాబాద్ రూరల్ : మల్యాల ఉద్యాన కళాశాలలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల్లో మల్యాల ఉద్యాన పరిశోధన స్థానంలో పనిచేసిన కార్మికులకు అవకాశం కల్పించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఉద్యాన కళాశాల ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి, కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడారు. మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ కేంద్రంలో పనిచేసి మరణించిన కుటుంబాల్లోని కుటుంబ సభ్యులకు, అర్హతఉన్న స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. అనంతరం కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. షరీఫ్, యాకూబ్ పాషా, శ్రీను, శ్రీశైలం, బీజాన, ఖదీజా, మైబు, సుల్తానా, వసుమతి, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, తండ శ్రీనాథ్, రమేష్, నరేష్, బాలు, సాయి, రఫియా, రాములమ్మ, నసీమా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శిశువుల అక్రమ దత్తత నేరం



దంతాలపల్లి : దత్తత పేరుతో శిశువులను అమ్మడం లేదా కొనడం నేరమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికపండ్ల అశోక్ పేర్కొన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అక్రమ దత్తతపై గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

బయ్యారం : పీవైఎల్–పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ముద్రించిన పోస్టర్‌ను గురువారం బయ్యారంలో మాస్‌లైన్ మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం ఆవిష్కరించారు.

'అర్హత కోల్పోతున్న నిరుద్యోగులు'

గార్ల : రేషన్ కార్డులు లేకపోవడంతో రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోలేక అర్హత కోల్పోతున్నారని పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీహెచ్ గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ పథకంకు రేషన్‌కార్డుతో ముడిపెట్టకుండా, అర్హులైన నిరుద్యోగులందరూ దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని పట్టణ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విభాగాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గుమ్మనూరులో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి భట్టివిక్రమార్క చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం చేశారు.

నెల్లికుదురు : తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీవ్ యువ వికాస పథకం అమలుకు తీసుకున్న నిర్ణయం పట్ల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్ది రాజేష్ హర్షం వ్యక్తం చేశారు.

క్షయవ్యాధిని నయం చేయొచ్చు

గంగారం : క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధిని అరికట్టవచ్చని టీబీ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రధానమంత్రి టీబీ ముక్తాభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహర కిట్స్ గురువారం పంపిణీ చేశారు.

నియామకం

గూడూరు : ఎస్సీ వర్గీకరణ జేఏసీ మండల అధ్యక్షుడుగా గుండెంగకు చెందిన కందిక శంకర్‌ను నియమిస్తున్నట్లు జేఏసీ జిల్లా అధ్యక్షుడు పందుల సారయ్య గురువారం నియామక పత్రాన్ని అందించారు. తన ప్రతిభను గుర్తించి మండల అధ్యక్షుడుగా నియమించిన జిల్లా, రాష్ట్ర శాఖ ప్రతినిధులకు

సంక్షిప్త సమాచారం

ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గీతకార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక

దంతాలపల్లి : గీత కార్మిక సంఘం మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన కారుపోతుల అనిల్, ప్రధాన కార్యదర్శిగా రేపోణి గ్రామానికి చెందిన గుండగాని యాకస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నియామకపత్రం అందజేత

మహబూబాబాద్ అర్బన్ : పంచాయతీ రాజ్ శాఖలో కారుణ్య నియామకంలో భాగంగా హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చేతుల మీదుకు జిల్లా నుంచి 14 మందికి నియామకపత్రాల ఉత్తర్వులు గురువారం అందుకున్నట్లు జిల్లా జెడ్పీ సీఈఓ పురుషోత్తం తెలిపారు.

కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడిగా యాకయ్య



నెహ్రూసెంటర్ : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన చీపిరి యాకయ్యను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి గురువారం తెలిపారు.

తెగిపడిన విద్యుత్ లైన్

దంతాలపల్లి : మండల కేంద్రంలోని విద్యుత్ లైన్ తెగిపడిన సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. మండల కేంద్రంలోని కాశీవాల బజార్ చర్చి దగ్గర కొన్ని రోజుల క్రితం విద్యుత్ లైన్ తెగి పడిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి

గార్ల : గార్ల మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను వెంటనే నియమించాలని కోరుతూ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు గురువారం రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లికుదురు : ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కూలీలతో కలసి గురువారం మండలంలోని మునిగలవీడు గ్రామంలో ఉపాధిహామీ తనిఖీ బృందానికి వినతి పత్రం అందజేశారు.

లంపీ స్కిన్ నివారణకు చర్యలు

డోర్నకల్ : మండలంలోని పలు ప్రాంతాల్లో పశువులకు వ్యాపిస్తున్న లంపీ స్కిన్ వ్యాధి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు మండల పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. గురువారం పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ హన్యాతండాలో పశువులకు లంపీస్కిన్ సోకినట్లు గుర్తించామన్నారు.

సృజనోత్సవంలో విజ్ఞాన ప్రదర్శన

నెల్లికుదురు : మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.వెంకటయ్య ఆధ్వర్యంలో గురువారం సృజనోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు వినూత్నమైన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు తిలకించడానికి మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

'ప్రభుత్వంపై విమర్శలు తగవు'

దంతాలపల్లి : ప్రజారంజకంగా పాలన సాగిస్తున్న ప్రభుత్వం పై విమర్శలు తగవని రామవరం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోని ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారన్నారు. అందులోని భాగంగా గ్రామానికి చెందిన ఓ మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామన్నారు. కానీ 2004–05లోనే ఆ మహిళ పేరుపై ఇందిరమ్మ ఇల్లు వచ్చినట్లు చూపడంతో ఆమె పేరును జాబితా నుంచి తొలిగించారే తప్ప ఎవ్వరు ఆమె పేరును తొలగించలేదన్నారు.

పశువుల సంత వేలం వాయిదా

మహబూబాబాద్ : పశువుల సంత వేలానికి మద్దతు ధర రానందున టెండర్‌ను వాయిదా వేసి ఈనెల 25న నిర్వహించనున్నట్లు కమిషనర్ నోముల రవీందర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం పశువుల సంత, చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్‌ను నిర్వహించగా ఐదురుగు టెండదారులు పాల్గొన్న మద్దతు ధర రాలేదన్నారు.

పనిముట్ల పంపిణీ

నర్సింహులపేట : గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉంటూ అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేయాలని డీఈ మధుసూదన్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దనాగారం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందికి పనిముట్లను, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్లను, హెల్మెట్లను అందజేశారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

తొర్రూరు : విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకులం, జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

క్రీడలతో బంగారు భవిష్యత్

మహబూబాబాద్ అర్బన్ : క్రీడలతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ జోలి సత్యనారాయణ అన్నారు. వరంగల్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించగా నలంద డిగ్రీ విద్యార్థులు గోల్డ్ మెడల్స్‌ను సాధించారు. విద్యార్థులను కళాశాలలో గురువారం అధ్యాపక బృందం అభినందించారు.

ఆకేరు వాగులో ఇసుక లభ్యతపై పరిశీలన

నర్సింహులపేట : మండలంలోని కొమ్ములవంచ, జయపురం, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, బొడ్డితండా శివారులోని ఆకేరు వాగులో గురువారం ఇసుక లభ్యతపై అధికారులు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ ఏడీ వెంకటరమణ, గ్రౌండ్ వాటర్ ఏడీ సురేష్, ఇరిగేషన్ డీఈఈ రాజ్‌కుమార్ బృందంగా వాగులో ఇసుక లభ్యత, భూగర్భ జలాలు ఎంత మేరలో ఉన్నాయని పరిశీలించారు.


వ్యాపారులపై చర్య తీసుకోవాలి

డోర్నకల్ : డోర్నకల్ మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో నల్లబెల్లం విక్రయిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డోర్నకల్ ప్రాంతంలో కొద్ది రోజులుగా గుడుంబాకు బానిసలైన కొంతమంది మృత్యువాత పడగా అనేక మంది అనారోగ్యాల పాలయ్యారని తెలిపారు.

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు

మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో గురువారం గ్యాస్ సిలిండర్, స్టౌవ్ వినియోగదారుడికి విక్రయించారు. కాగా సిబ్బంది గ్యాస్ సిలిండర్‌ను తనిఖీ చేసేందుకు లైటర్‌తో అంటించగా దాని నుంచి గ్యాస్ లీకేజీ కావడంతో ఒక్కసారి మంటలు వచ్చాయి. దాంతో వెంటనే సిబ్బంది బకెట్లతో నీళ్లు పోసి మంటలు ఆర్పారు. ఈవిషయంపై మేనేజర్ బోనగిరి ప్రసాద్‌ను వివరణ కోరగా గ్యాస్ సిలిండర్‌కు స్టౌవ్ ఏర్పాటు చేసిన తర్వాత సిలిండర్ లీకేజీ కావడంతో మంటలు వచ్చాయన్నారు.

జామాయిల్ చెట్ల దగ్ధం



దంతాలపల్లి : మండల కేంద్రానికి చెందిన ఎల్లు పూర్ణచందర్‌రెడ్డికి చెందిన మూడెకరాల జామాయిల్ తోటలోని చెట్లు గురువారం ప్రమాదవశాత్తు కాలిపోయాయి. వాటివిలువ సుమారు రూ.5 లక్షల ఉంటాయని రైతు పూర్ణచందర్ తెలిపాడు. ఇదే విషయాన్ని అగ్ని మాపక సిబ్బందికి ఫోన్ చేయగా వాహనం టైర్ మార్చాలని, పచ్చి మండలతో మంటలు ఆర్పాలని ఉచిత సలహాలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశాడు. జామాయిల్ చెట్లు కాలిపోవడం చివరి దశలో వచ్చి మంటలు ఆర్పారని అన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కురవి : మండలంలోని పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. కాకులబోడు తండాకు చెందిన బానోత్ రాముకు రూ.52,500, నారాయణపురం గ్రామానికి చెందిన బానోత్ శ్రీకాంత్‌కు రూ.16,500, కురవికి చెందిన బత్తుల ఐలమ్మకు రూ.20, 500ల చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు గుగులోత్ నెహ్రూనాయక్, బాదె నాగయ్య, బోడ శ్రీను, జి.కిషన్‌నాయక్, శంకర్ అందజేశారు.

క్రైం కార్నర్

బావిలో పడి వ్యక్తి మృతి



బోలెషావళి మృతదేహం

కేసముద్రం : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రంగాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్కె బోలెషావళి (55) బుధవారం దేవుని పండుగకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి వ్యవసాయ బావిలో పడటంతో నీటమునిగి మృతి చెందాడు. గురువారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

దంతాలపల్లి : మండలంలోని రేపోణికి చెందిన బేతమల్లు రామయ్యకు బైక్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు బాధితుడి కుమారుడు ఐలయ్య తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

తొర్రూరు రూరల్ : మండలంలోని మాటేడు శివారులోని ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తొర్రూరు పట్టణానికి చెందిన చార్ల కిరణ్ ఖమ్మం వైపు నుంచి తొర్రూరుకు బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి కిందపడడంతో తల, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ప్రాథమిక వైద్యం చేయించిన తర్వాత వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ఉప్పలమ్మ గుడి ధ్వంసం

దంతాలపల్లి : మండల కేంద్రంలో ఉప్పలమ్మ గుడిని ధ్వంసం చేసిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎల్లు రాఘవయ్య బొడ్లాడ స్టేజి వద్ద వ్యవసాయ భూమి సర్వేనంబర్ 432–1లో ఉప్పలమ్మ గుడిని ఏర్పాటు చేశాడు. కాగా ఈ భూమిపై కొన్నేళ్ల నుంచి న్యాయస్థానంలో వివాదం నడుస్తోంది. అదే గ్రామానికి చెందిన ఎల్లు శ్రీనివాస్‌రెడ్డి ఆ గుడిని ధ్వసం చేయగా తిరిగి 2024లో రాఘవయ్య గుడిని నిర్మించారు. ఉప్పలమ్మ దేవతను పూజించేందుకు సన్నద్ధమవుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గుడిని ధ్వంసం చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు

కేసముద్రం : కేసముద్రం మున్సిపల్ పరిధి ఆదర్శనగర్ కాలనీకి చెందిన బిర్రు సందీప్‌ను కులం పేరుతో దూషించిన ఓ వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు. నెక్కొండ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఈనెల 10న వెంకటగిరి సమీపంలోని రైస్‌మిల్లు వద్దకు వచ్చి, నీ అకౌంట్‌లో డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యాయని, వాటిని తిరిగి తమకు ఇవ్వాలని తనను బెదిరించి, కులం పేరుతో దూషించారని సందీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దూషించిన వారిలో ఒకరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు, మరొకరిపై బెదిరింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం ఎస్సై తెలిపారు.

'మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ'

డోర్నకల్/కురవి / కేసముద్రం/గంగారం : మంద కృష్ణమాదిగ 30ఏళ్లుగా చేసిన పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని అంబేడ్కర్ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. డోర్నకల్‌లోని స్థానిక గాంధీసెంటర్‌లో గురువారం అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే సీరోలు మండలం చింతపల్లి, తాళ్లసంకీస గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదం పొందడాన్ని హర్షిస్తూ ఆయా గ్రామాల్లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.